సాక్షి
విశాఖపట్నం
7
ఆదివారం : 29 : జూన్ : 2025



తాగునీటికి కటకట

జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది సమ్మెతో విశాఖలో నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శివాజీపాలెంలో మహిళలు ట్యాంకర్ వద్ద ఇలా నీరుపట్టుకున్నారు.

ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే..

కూటమి నేతలకు లబ్ధి చేకూరేలా మాస్టర్ ప్లాన్‌లో మార్పులకు కసరత్తు

- బీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక-2041 పునఃపరిశీలన మరూ..
- అభ్యంతరాల కోసం జూలై 17 వరకు గడువు పొడిగింపు
- వాటిపై నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమక్షంలోనే పరిశీలన
- రేపటి నుంచి జూలై 17 వరకు సమీక్షలు



విశాఖ సిటీ : అంతా అనుకున్నట్లే చేస్తున్నారు. విశాఖ బృహత్తర ప్రణాళిక-2041లో మార్పులు, చేర్పులకు సిద్ధమవుతున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల సమక్షంలోనే ఈ తంతు పూర్తి చేసేందుకు ముహూర్తం పెట్టేశారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల పరిశీలన పేరుతో తమ వారికి లబ్ధి చేకూర్చేందుకు పూనుకుంటున్నారు. ఇందుకోసం ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 17వ తేదీ వరకు నియోజకవర్గాల వారీ ఆయా ఎమ్మెల్యేల సమక్షంలోనే అభ్యంతరాలపై సమీక్షించాలని నిర్ణయించారు. ఒకవైపు ఫిర్యాదులను పరిశీలిస్తున్నట్లు తేదీలు ఖరారు చేసినప్పటికీ.. అభ్యంతరాల స్వీకరణకు గడువు పొడిగించడం విశేషం. ఇందులో కూటమి 'రియల్ వ్యాపారానికి' అనుగుణంగా ప్లాన్‌లో సవరణలు చేసే అవకాశం ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తోంది.

అభ్యంతరాల స్వీకరణకు గడువు పొడిగింపు

వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్-2041లో పునఃపరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. మే 22వ తేదీ నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కేవలం 755 మాత్రమే అభ్యంతరాలు వచ్చాయి. వాస్తవానికి వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తాయని కూటమి ప్రజాప్రతినిధులు భావించారు. ఆ సంఖ్యను అడ్డుపెట్టుకుని ఇప్పటికే సిద్ధమైన మాస్టర్‌ప్లాన్-2041పై ఆరోపణలు గుప్పించాలని నిర్ణయించారు. కానీ నామమాత్రంగానే అభ్యంతరాలు రావడంతో కూటమి నేతలు కంగుతిన్నారు. దీంతో ఈ అభ్యంతరాల స్వీకరణ గడువు మరోసారి పొడిగించారు. జూలై 17వ తేదీ వరకు ఫిర్యాదులు చేయవచ్చని తాజాగా ప్రకటించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి, ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు ఎక్కువగా రాకపోవడంతో ఆయా జిల్లాల రెవెన్యూ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అభ్యంతరాలు తీసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట తదితర ప్రాంతాల వారి సౌలభ్యం కోసమంటూ అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో అభ్యంతరాలను ఈ నెల 30, జూలై 1వ తేదీల్లో స్వీకరించనున్నారు. అలాగే ఎస్.కోట, చీపురుపల్లి, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల ప్రాంతాల వారు విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో జూలై 14, 15 తేదీల్లో ఫిర్యాదులను అందించే అవకాశం కల్పించారు.

పరిశీలనలో సిఫార్సులకే పెద్ద పీట?

మాస్టర్‌ప్లాన్ కోసం వచ్చిన అభ్యంతరాల పరిశీలనకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేల సమక్షంలోనే వీటి పరిశీలనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 17వ తేదీ వరకు నియోజకవర్గాల వారీగా అభ్యంతరాలను పరిశీలించనున్నారు. నిర్ణీత తేదీ, సమయాల్లో ఎమ్మెల్యేలతో పాటు ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని చెబుతున్నప్పటికీ.. ఆ పరిస్థితి ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జూలై 16, 17 తేదీల్లో వీఎంఆర్‌డీఏ కార్యాలయం 3వ అంతస్తులో మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ అభ్యంతరాలను స్వీకరించనున్నారు. కేవలం కూటమి ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల రియల్ వ్యాపారానికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంతో మాస్టర్‌ప్లాన్‌లో సవరణకు సిద్ధమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అభ్యంతరాల పరిశీలన ఇలా..

తేదీ	నియోజకవర్గాలు	సమయం	వేదిక
జూన్ 30, జూలై 1	అనకాపల్లి, పాయకరావుపేట, యలమంచిలి	11 నుంచి 5 వరకు	అనకాపల్లి ఆర్డీఓ ఆఫీస్
జూలై 3, 4	పెందుర్తి గాజువాక	11 నుంచి 5 వరకు	వీఎంఆర్‌డీఏ ఆఫీస్
జూలై 7, 8	విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ	11 నుంచి 5 వరకు	వీఎంఆర్‌డీఏ ఆఫీస్
జూలై 10,11	విశాఖ తూర్పు, భీమిలి	11 నుంచి 5 వరకు	వీఎంఆర్‌డీఏ ఆఫీస్
జూలై 14, 15	ఎస్.కోట, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి	11 నుంచి 5 వరకు	విజయనగరం కలెక్టరేట్

వందేభారత్ మెయింటెనెన్స్ డిపో

వైజాగ్‌లో..

- అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ, విశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు
- విశాఖ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు ఇక వేగవంతం
- దువ్వాడ-పలాస మధ్య రైల్వే లైన్ల వెంట ఫెన్సింగ్
- మల్లివీడు వద్ద పీపీపీ పద్ధతిలో గతిశక్తి టెర్మినల్ ఏర్పాటు
- దక్షిణ కోస్తా రైల్వే జీఎం కార్యాలయం కోసం 3, 4 స్థలాల పరిశీలన
- 'సాక్షి'తో వాల్తేరు డివిజన్ డీఆర్ఎం లలిత్ బోహ్రా

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

వందేభారత్ రైళ్ల నిర్వహణ కోసం విశాఖలో కోచింగ్ డిపో ఏర్పాటు చేయనున్నట్లు వాల్తేరు డివిజన్ రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా తెలిపారు. రైల్వే యార్డులో అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ, విశాలమైన ప్రాంగణంలో డిపో నిర్మాణం జరగనుందని పేర్కొన్నారు. రైళ్ల నిర్వహణ పనుల విషయంలో జాప్యం లేకుండా ఉండేందుకు 24 గంటలు ఈ డిపో పనిచేస్తోందన్నారు. దువ్వాడలో వందేభారత్ రైళ్ల స్టాప్ పాయింట్ కోసం వచ్చే వారం ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వివరించారు. అలాగే విశాఖ కేంద్రంగా ఏర్పాటవుతున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్ నియామకం జరిగిందని, వారి కార్యాలయం కోసం 3, 4 ప్రాంతాలను తాత్కాలికంగా పరిశీలిస్తున్నామన్నారు. విశాఖ నుంచి దువ్వాడ వరకు కొత్త రైల్వే లైను పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ పనులకు ఉన్న కోర్టు కేసుల అడ్డంకి తొలగిపోయిందని, ఇక పనులు వేగవంతం చేస్తామన్నారు. రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు మరింతగా మెరుగుపరిచే లక్ష్యంతోనే పనిచేస్తున్నామన్నారు. శనివారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంకా ఏమన్నారంటే ఆయన మాటల్లోనే..

మల్లివీడు వద్ద గతి శక్తి టెర్మినల్..!

కొత్తవలస రైల్వే స్టేషన్ దాటిన తర్వాత గల మల్లివీడు రైల్వే స్టేషన్ వద్ద గతిశక్తి టెర్మినల్ (జీసీటీ) ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ మెకానికల్ హ్యాండ్లింగ్, వేర్ హౌసింగ్, ట్రక్ రిపేర్ సెంటర్, ఫ్యూయలింగ్ సెంటర్ ఏర్పాటుకానున్నాయి.


డీఆర్ఎం లలిత్ బోహ్రా

సాక్షి ఇంటర్వ్యూ

మెకానికల్ హ్యాండ్లింగ్ ద్వారా రేకుల లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతం అవుతుంది. తద్వారా రేకుల అందుబాటు సమయం కూడా పెరుగుతుంది. తద్వారా రేకుల కొరత కూడా కొద్ది మేర తగ్గే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే టెండర్లను ఆహ్వానించాం. ఆగస్టులో టెండర్ దాఖలుకు గడువు ఉంది. ఇది పూర్తిగా రైల్వే స్థలంలోనే ఏర్పాటు కానుంది.

శాటిలైట్ స్టేషన్లుగా మరింత అభివృద్ధి..!

విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ప్రస్తుతం రోజూ 50 వేల మంది వరకూ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రైల్వే లైన్లు తక్కువగా ఉండటం వల్ల రైళ్ల వేగం కూడా దువ్వాడ నుంచి తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొత్త రైల్వే లైన్ల పనులు సాగుతున్నాయి. 3, 4 రైల్వే లైన్ల పనులు జరుగుతున్నప్పటికీ.. భవిష్యత్ అవసరాల నేపథ్యంలో దువ్వాడ, పెందుర్తి శాటిలైట్ స్టేషన్లుగా మరింత అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉంది. తద్వారా విశాఖ రైల్వే స్టేషన్‌పై భారం తగ్గుతుంది. ఇప్పటికే దువ్వాడ స్టేషన్‌లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. పెందుర్తి స్టేషన్‌లోనూ అభివృద్ధి పనులు చేపడతాం.

దువ్వాడ నుంచి పలాసకు రయ్ రయ్!

దువ్వాడ నుంచి పలాస వరకు రైల్వే లైన్ల వెంట ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే ఈ పనులకు టెండర్లు పూర్తయ్యాయి. సదరు కాంట్రాక్టరుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ) కూడా జారీచేశాం. రానున్న 12 నెలల్లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించాం. ఈ ఫెన్సింగ్ ఏర్పాటుతో రైళ్ల రాకపోకల సందర్భంగా ఎటువంటి ప్రమాదాలకు... రైల్వే లైన్ల క్రాసింగ్‌కు అవకాశం ఉండదు. తద్వారా రైళ్ల వేగాన్ని గంటకు 160 కిలోమీటర్ల వరకూ తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ఈ మార్గంలో రైళ్ల వేగాన్ని పెంచడం ద్వారా ప్రయాణికులు గమ్యాన్ని వేగంగా చేరుకునే అవకాశం ఉంటుంది.

దువ్వాడలో వందేభారత్ స్టాప్ కోసం ప్రతిపాదనలు

ప్రస్తుతం వైజాగ్-సికింద్రాబాద్ మధ్య రెండు వందేభారత్ రైళ్లు సేవలందిస్తున్నాయి. ప్రయాణికుల నుంచి వీటికి మంచి డిమాండ్ ఉంది. ఈ రెండు రైళ్ల నిర్వహణ సికింద్రాబాద్‌లోని డిపోలో జరుగుతోంది. విశాఖలో ఈ రైళ్ల నిర్వహణ కోసం డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో ఈ డిపో పనులు ప్రారంభించాలని నిర్ణయించాం. అదేవిధంగా ఈ రైళ్లను దువ్వాడ స్టేషన్‌లోనూ నిలపాలనే డిమాండ్ ప్రయాణికుల నుంచి ఉంది. దీనిపై వచ్చే వారం ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపుతాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు..!

కోర్టు కేసుతో రైల్వే స్టేషన్‌లో పనులు ముందుకు సాగలేదు. చివరకు కోర్టు కేసు గెలిచాం. పనులు ప్రారంభిస్తాం. మొత్తం 14 ప్లాట్‌ఫారంలను ప్రధాన బిల్డింగ్‌ను ప్రయాణికులు చేరేందుకు వీలుగా 72 మీటర్ల పొడవైన కాంకోర్స్ ఏర్పాటవుతుంది. ఇక్కడ ప్రయాణికులు సేదతీరేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఇప్పుడున్న ప్లాట్‌ఫారం సైజు కూడా పెరుగుతుంది. ఇక జ్ఞానాపురం వైపు స్టేషన్ నుంచి నేరుగా బయటకు వెళ్లేందుకు వీలుగా ప్లాట్‌ఫారంల నిర్మాణం ఉంటుంది. మల్టీ లెవల్ కారు పార్కింగ్ సదుపాయంతో పాటు ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. గత 8 నెలలుగా నిలిచిన పనులు పట్టాలెక్కనున్నాయి.

పీలా వర్సెస్ గండి బాబ్జీ

- టీడీపీ అంతర్గత సమావేశంలో పరస్పరం దూషించుకున్న మేయర్, టీడీపీ ఇన్‌చార్జి
- నువ్వు నన్ను ఎందుకు కార్యక్రమాలకు పిలవడం లేదని నిలదీసిన గండి
- అధికారిక కార్యక్రమాలకు నిన్నెందుకు పిలుస్తానంటూ పీలా కౌంటర్
- పెందుర్తిలో కొన్ని కార్యక్రమాలకు నాకు ఆహ్వానం ఇవ్వడం లేదు: మేయర్
- పెందుర్తిలో టీడీపీ కుమ్ములాటలు

పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గంలో టీడీపీ అంతర్గత కుమ్ములాటల మెగా సీరియల్ కొనసాగుతుంది. పార్టీ సమావేశాల్లో టీడీపీలో ఉన్న విబేధాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. పార్టీ కీలక నాయకులే రోడ్డెక్కి రచ్చకు దిగుతున్నారు. అధికారంలో ఉండడంతో ఆధిపత్యం కోసం చోటామోటా నాయకుల నుంచి నియోజకవర్గంలోని కీలక నేతలు సైతం కీచులాడుకుంటున్నారు. తాజాగా శనివారం పెందుర్తిలో జరిగిన టీడీపీ నియోజకవర్గస్థాయి సంస్థాగత ఎన్నికల సన్నద్ధ సమావేశంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం నడిచింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుటే పరస్పరం దూషణలకు దిగారు. 'పిలుపు'ల విషయంలో ఇద్దరి మధ్య మాటలు తూటాలు పేలాయి.


వేదికపైనే మేయర్ పీలా శ్రీనివాసరావు, గండి బాబ్జీ మధ్య వాగ్వాదం

అసలేం జరిగిందంటే..

పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో పెందుర్తిలో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న గండి బాబ్జీ దాదాపు 2 గంటలు ఆలస్యంగా సమావేశానికి వచ్చారు. అదే సమయంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, గండి బాబ్జీ చిరకాల ప్రత్యర్థి అయిన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కుమారుడు అప్పలనాయుడు తన వర్గీయులతో కలిసి సమావేశానికి వచ్చారు. ఈ క్రమంలో గండి బాబ్జీ ప్రసంగిస్తూ 'నేను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిని. రాష్ట్ర స్థాయిలో ఓ కార్పొరేషన్‌కు చైర్మన్ హోదాలో ఉన్నాను. కానీ నన్ను నియోజకవర్గ పరిధిలో ఉన్న జీవీఎంసీ వార్డుల్లోని ముఖ్య కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు. అంతా నువ్వే చేసుకుంటున్నావ్' అంటూ మేయర్ పీలాను ఉద్దేశించి ఘాటుగా స్పందించారు. దీంతో పీలా వెంటనే మైక్ అందుకుని 'పెందుర్తి పట్టణం నా అడ్డా. నాకు ఇక్కడ తిరుగులేదు. బండారు సత్యనారాయణ మూర్తి లాంటి వ్యక్తే నా అనుమతి లేకుండా ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు చేసేవారు కాదు. నువ్వు మాత్రం పార్టీ కార్యక్రమాలకు కూడా మేయర్ హోదాలో ఉన్న నన్ను పిలవడం లేదు. అయినా అధికారిక కార్యక్రమాలకు నిన్ను ఎందుకు పిలవాలి' అంటూ అంతే ఘాటుగా బదులిచ్చారు. ఈ క్రమంలో వేదిక మీద నుంచే పీలా, గండి పరస్పరం మాటలు విరుసుకున్నారు. ఇక పరిస్థితి చేదాటిపోతుందన్న సమయంలో కోరాడ, ఇతర నాయకులు కలగజేసుకుని ఇద్దరినీ సముదాయించారు.

అందుకేనా..

టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న గండి బాబ్జీపై ప్రత్యర్థుల కంటే స్వపక్షంలోనే ఎక్కువ మంది గిట్టనివారు ఉన్నారు. జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మేయర్ పీలా శ్రీనివాసరావు అనేకసార్లు గండి బాబ్జీని కౌంటర్ చేసిన సందర్భాలు ఉన్నాయి. బహిరంగంగానే బాబ్జీపై విమర్శలు దిగుతున్నారు. ఈ క్రమంలో శనివారం సమావేశానికి బాబ్జీకి చిరకాల ప్రత్యర్థి అయిన బండారు కుమారుడు అప్పలనాయుడు, ఇతర నాయకులతో పీలా కలిసి రావడం బాబ్జీకి చిర్రెత్తుకొచ్చినట్లు తెలుస్తుంది. అదే సమయంలో బాబ్జీపై చాలాకాలంగా గుర్రుగా ఉన్న పీలా సైతం సందర్భం చూసి విరుచుకుపడ్డారు. మొత్తానికి పెందుర్తి టీడీపీ కుక్కలు చింపిన విస్తరిగా మారిందని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు.

సిఫార్సులతో బదిలీలా?

- సచివాలయ ఉద్యోగుల ఆగ్రహం
- బదిలీ ప్రక్రియలో పాల్గొనకుండా నిరసన


ఆందోళన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

జగదాంబ: జీవీఎంసీ పరిధిలోని సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. ఐదేళ్లు దాటిన సచివాలయ మౌలిక సదుపాయాల కార్యదర్శులకు బదిలీ చేయడానికి కూటమి ప్రభుత్వం ఆమోదం తెలపగా, శనివారం జీవీఎంసీ జోన్-4 సూర్యాబాగ్ కార్యాలయంలో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. అధికారులు ముందుగా చెప్పినట్లు మూడు ఆప్షన్ల ప్రక్రియ కాకుండా, కూటమి నేతల సిఫార్సుల ప్రకారం బదిలీలు జరుగుతున్నాయని సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కూటమి నేతల సిఫార్సులకు అధికారులు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్షన్‌లో ఇచ్చిన మూడు సచివాలయాల మాట మరచి అధికారులు నేతలకు తొత్తులుగా వ్యవహరించడంతో సీనియర్ కార్యదర్శులకు అన్యాయం జరిగిందని వారు వాపోయారు. బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. పారదర్శకంగా బదిలీలు చేయాలంటూ బదిలీల ప్రక్రియ నుంచి బయటకు వచ్చేశారు.

అర్హులకు అన్యాయం

మరికొందరికి బదిలీ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ కోసం దరఖాస్తు పెట్టుకుని వెళ్లిపోవాలని సూచించినట్లు చెబుతున్నారు. దీనివల్ల అర్హులైన కార్యదర్శులకు అన్యాయం జరుగుతుందని వారు వాపోయారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, బదిలీల ప్రక్రియను సక్రమంగా జరిపించాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

ఆరుగురు తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

మహారాణిపేట: జిల్లాలో తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ ఊహించిన విధంగానే పూర్తయింది. కూటమి ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకుల సిఫార్సుల ఆధారంగా రెండో విడత బదిలీలను పూర్తి చేశారు. శనివారం కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆరుగురు తహసీల్దార్లకు పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 9వ తేదీన జరిగిన బదిలీల్లో విధుల్లో చేరిన కొందరు అధికారులకు మళ్లీ ఇప్పుడు పోస్టింగులు ఇవ్వడం గమనార్హం.

కీలక బదిలీలు, ఒత్తిళ్లు : పెందుర్తి తహసీల్దార్‌గా ఎం.ఆనంద కుమార్‌ను కొనసాగించడానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. డిప్యూటీ తహసీల్దార్ ఎ. సంతోష్ కిరణ్‌కు పెందుర్తి తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అల్లూరి జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ టి.రామకృష్ణకు వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. వీఎంఆర్‌డీఏలో స్పెషల్ తహసీల్దార్‌గా ఉన్న టి.శ్రీవల్లీ తహసీల్దార్ పోస్టింగు కోసం పట్టుబట్టారు. ఆమె భూమి శిస్తు చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ) నుంచి కూడా ఉత్తర్వులు తెచ్చుకోవడంతో ఆనందపురం తహసీల్దార్‌గా నియమించారు. అల్లూరి జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్‌కు మొదట ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ తహసీల్దార్‌గా నియమించారు. ఎక్కడైనా తహసీల్దార్ పోస్టు కావాలని ప్రసాద్ కోరడంతో సీతమ్మధార తహసీల్దార్‌గా నియమించారు. విజయనగరం జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ బి.గురుమూర్తికి ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ తహసీల్దార్‌గా నియమించారు. గాజువాక డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాస్‌ను గాజువాక తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఈ బదిలీల ప్రక్రియలో రాజకీయ సిఫార్సులు, ఒత్తిళ్లు స్పష్టంగా కనిపించాయని జిల్లా వర్గాలు చెబుతున్నాయి.

సమ్మె తాత్కాలిక విరమణ

- 2వ తేదీ వరకు డెడ్‌లైన్ విధించిన కార్మికులు
- లేదంటే 3వ తేదీ నుంచి సమ్మె
- మేయర్‌తో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ చర్చలు


మేయర్ పీలా శ్రీనివాసరావుతో చర్చలు జరుపుతున్న జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆనందరావు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ తాగునీటి విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన సమ్మెను తాత్కాలికంగా విరమించారు. మేయర్ పీలా శ్రీనివాసరావుతో యూనియన్ నాయకులు జరిపిన చర్చలు సఫలం కావడంతో కార్మికులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కార్మికుల జీతాల పెంపు విషయమై బుధవారం లోపల పరిష్కరించేందుకు మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్ గార్గ్ హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు కార్మికులు సమ్మెను తాత్కాలికంగా విరమించినట్టు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు సాక్షికి తెలిపారు. బుధవారంలోపు (వచ్చే నెల 2వ తేదీ) హామీ అమలు కాకపోతే 3వ తేదీ నుంచి తిరిగి సమ్మె బాట తప్పదని ఆయన స్పష్టం చేశారు. పెందుర్తిలోని తన క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ నాయకులతో మేయర్ చర్చలు జరిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు 50 శాతం తాగునీటి సరఫరా చేయగా, మిగిలిన 50 శాతం సాయంత్రానికి పూర్తిగా పునరుద్ధరించినట్టు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ప్రజలకు తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేప ట్టారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలు తమ సమస్యల కోసం హెల్ప్‌లైన్ నెంబరు 0891–2507225ను సంప్రదించవచ్చన్నారు.


నీరు దొరక్క దిగాలుగా...



శివాజీపాలెంలో తాగునీటి కోసం మహిళల పాట్లు


చుక్క నీటి కోసం తాపత్రయం

జీవీఎంసీ తాగునీటి విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మెతో నగరంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బిందెలతో రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.' గుక్కెడు నీరివ్వలేని వారు పాలన ఎలా సాగించగలరు?' అంటూ జీవీఎంసీ 7వ వార్డులోని వాంబే కాలనీ, 6వ వార్డులోని పీఎం పాలెం జేఎన్ఎన్ యూఆర్ఎం బీ-2 కాలనీ, వైఎస్సార్ కాలనీ, వాంబేకాలనీల్లో మహిళలు బిందెలతో నిరసన



తెలిపారు. మంచి నీరు కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొన్ని వార్డుల్లో ప్రజలు బోరు బావుల వద్ద బారులు తీరారు. ఆరిలోవ కొండవాలు ప్రాంతాలైన దీన్‌దయాల్‌పురం, చినగదిలి, పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీ, హనుమంతవాక, ఆదర్శనగర్, బీసీ కాలనీ, సింహగిరి కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మున్సిపల్ నీరు అందక, బోర్లు పనిచేయక దైనందిన కార్యకలాపాలకు కూడా నీరు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. తాగునీటి కోసం ప్రజలు బోరింగ్‌లను ఆశ్రయించాల్సి వచ్చింది.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి


వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సీతంపేట: జీవీఎంసీ తాగునీటి విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె వల్ల నగరంలో తలెత్తుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కే.కే. రాజు ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు వేతనాల పెంపు కోరుతూ ఎప్పటికప్పుడు సమ్మెలు చేయడం వల్ల నగరంలో తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. రెండు రోజులుగా విశాఖ ప్రజలు, ముఖ్యంగా కొండవాలు ప్రాంతాల వారు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని, ప్రజలు తాగునీటి కోసం రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా పర్మినెంట్ ఉద్యోగులతో నీటి సరఫరాను చేపట్టాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలి


మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడమే సరైన పరిష్కారమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. బ్లాస్ట్ ఫర్నేస్-3 తిరిగి ఉత్పత్తి ప్రారంభించడాన్ని కమిటీ అభినందించింది. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు, కమిటీ కో కన్వీనర్స్ డి.ఆదినారాయణ, రామచంద్రరావు, వి.శ్రీనివాసరావుతో కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే సొంత గనులు ఇవ్వకుండా ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతోందని ఆరోపించారు. దీనివల్ల ఏటా రూ. 4 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. కనీసం స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లోనైనా విలీనం చేయాలని వారు కోరారు. కేంద్రం స్టీల్‌ప్లాంట్‌లోని ఉత్పత్తి విభాగాల ఆపరేషన్, మెయింటెనెన్స్ పనులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించాలని నిర్ణయించిందని, సింటర్ ప్లాంట్, రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ విభాగాలకు జూలై 12 నాటికి టెండర్లు ఆహ్వానించిందని తెలిపారు. ఈ విధంగా మొత్తం 13 విభాగాలను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇది పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చే ప్రయత్నమని మండిపడ్డారు. 1583 రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని, గత మూడు నెలల్లో సుమారు 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఎటువంటి నోటీసులు లేకుండా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది నిర్వాసితులను ఉద్యోగాల నుంచి తొలగిస్తుంటే గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాజమాన్యంతో కుమ్మక్కై మోసగిస్తున్నారని ఆరోపించారు.

121 మంది పోలీస్ సిబ్బందికి రివార్డులు


సిబ్బందికి రివార్డు ఆర్డర్ అందజేస్తున్న సీపీ

విశాఖ సిటీ: కేసుల పరిష్కారంలో ప్రతిభ చూపించిన 121 మంది పోలీస్ సిబ్బందికి రివార్డుల లభించాయి. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా ఈ రివార్డు మంజూరు ఆర్డర్లను అందజేశారు. గంజాయి, చోరీ, ఇతరత్రా కేసులో సాంకేతికతను వినియోగించి నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన 121 మంది (హోం గార్డు నుంచి సీఐ వరకు) సిబ్బందిని సీపీ అభినందించారు.

విదేశాల్లో పూర్వ విద్యార్థుల సంఘాలు

- ఎగ్జిట్ ఎంగేజ్‌మెంట్ ఈవినింగ్ కార్యక్రమంలో ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: విదేశాలలో ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ప్రకటించారు. శనివారం బీచ్ రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్), ఆంధ్ర విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన 'ఎగ్జిట్ ఎంగేజ్‌మెంట్ ఈవినింగ్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విదేశీ విద్యార్థులతో ఏయూ ప్రయాణం విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిందని అన్నారు. ఏయూ పూర్వ విద్యార్థులుగా విదేశాల్లో విశ్వవిద్యాలయం ఖ్యాతిని పెంచే విధంగా పనిచేయాలని ఆయన సూచించారు. విదేశీ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఐసీసీఆర్ స్కాలర్‌షిప్ విభాగం డైరెక్టర్ సంజీవ్ వేది మాట్లాడుతూ, ఏయూలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విదేశీ విద్యార్థులు తమతో పాటు భారతీయతను తీసుకువెళుతున్నారని అన్నారు. ఐసీసీఆర్ అందించే స్కాలర్‌షిప్‌ల గురించి ఇతర దేశాల్లోని విద్యార్థులకు వివరించి, మరింత మందికి ఉపయోగపడాలని సూచించారు. ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 59 దేశాల నుంచి


స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో ఏయూ వీసీ రాజశేఖర్, ఐసీసీఆర్ ప్రతినిధులు


విదేశీ విద్యార్థుల సెల్ఫీ సందడి


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

1,100 మందికి పైగా విదేశీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నా రని తెలిపారు. వారికి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఏయూతో తమ అనుబంధాన్ని, విశాఖ నగరం, తెలుగు ప్రజల అభిమానాన్ని గుర్తు చేసుకుంటూ తమ అనుభూతులను పంచుకున్నారు. అనంతరం వారికి అల్యూమ్ని కార్డులు అందజేశారు. వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు తమ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు తమ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐసీసీఆర్ జోనల్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం అసోసియేట్ డీన్ ఆచార్య ఎస్.ఎం. యుగంధర్ ప్రిన్సిపాల్స్ ఆచార్య ఏ. నరసింహారావు, ఎంవీఆర్ రాజు, జి. గిరిజ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు కేసుల్లో ఒకటి మాత్రమే పీడీఎస్ బియ్యం

మహారాణిపేట : ఇటీవల పోర్టు ఏరియాలో అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుబడిన మూడు ప్రజా పీడీఎస్ బియ్యం కేసులలో, కేవలం ఒక కేసులో మాత్రమే పీడీఎస్ బియ్యం ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. మిగిలిన రెండు కేసులలో స్వాధీనం చేసుకున్న బియ్యం పీడీఎస్ కాదని ల్యాబ్ పరీక్షల్లో తేలిందని ఆయన వెల్లడించారు. ఈ నెల 23, 24 తేదీల్లో పోర్టులో అక్రమ బియ్యం రవాణా అవుతున్నట్లు సమాచారం రావడంతో సివిల్ సప్లైస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం మూడు కేసులలో 473 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, 6ఏ కేసులు నమోదు చేశారు. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్, అదాని ఎక్స్‌పోర్ట్ మొత్తం 150 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ల్యాబ్ టెస్టుకు పంపగా, ఇవి పీడీఎస్ బియ్యం కాదని తేలిందన్నారు. పంచవటి టోల్ గేట్ వద్ద స్వాధీనం చేసుకున్న 167 మెట్రిక్ టన్నుల బియ్యం కూడా పీడీఎస్ బియ్యం కాదని ల్యాబ్ పరీక్షల్లో తేలిందని జేసీ వివరించారు.గేట్ వే ఈస్ట్ ఇండియా ప్రైవేట్ కంపెనీలో స్వాధీనం చేసుకున్న 156 మెట్రిక్ టన్నుల బియ్యం పీడీఎస్ బియ్యంగా నిర్ధారించామన్నారు. దీనిపై 6ఏ కేసుతో పాటు బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

విశాఖ సిటీ : పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లు, వారిపై పెడుతున్న నిఘా చర్యలను ఆరా తీశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. నగరంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పూర్తిగా నివారించాలని, ఆయా స్టేషన్ పరిధిలో గల నిర్మానుష్య, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తూ విజిబుల్ పోలీసింగ్, పికెట్, అవసరం మేరకు డికాయ్ టీంలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోక్సో కేసులపైన ఆరా తీశారు. సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీసీపీ-1 అజితా వేజెండ్ల, డీసీపీ(క్రైమ్స్) లతా మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీఆర్‌వోల బదిలీల కౌన్సెలింగ్

మహారాణిపేట: సచివాలయం గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్‌వోలు) బదిలీల కౌన్సెలింగ్ శనివారం కలెక్టర్ కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియను కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.ఈశ్వరరావు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న మొత్తం 570 మంది వీఆర్‌వోలలో, 432 మందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఖాళీలను చూపించి, వారిని ఎంపిక చేసుకునే పద్ధతిలో ఈ కౌన్సెలింగ్ జరిగింది. ఉదయం ప్రారంభమైన ఈ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది.

'ఆశా కార్యకర్తల నోటిఫికేషన్ ఇవ్వలేదు'

మహారాణిపేట: జిల్లాలో ఆశా కార్యకర్తల నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్ ఇంకా విడుదల కాలేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ పి.జగదీశ్వరరావు స్పష్టం చేశారు. ప్రస్తుతం విడుదలైన నోటిఫికేషన్‌కు విశాఖ జిల్లాతో ఎటువంటి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు.ఈ విషయంపై పలువురు కార్యాలయానికి, ఫోన్ ద్వారా సంప్రదిస్తున్నారని, త్వరలో కలెక్టర్ అనుమతి తీసుకుని నోటిఫికేషన్ జారీ చేస్తామని డీఎంహెచ్ఓ తెలిపారు. అనుమతి రాగానే ప్రకటన విడుదల చేస్తామని ఆయన వివరించారు.

సమాచార శాఖ మంత్రి దృష్టికి జర్నలిస్టుల సమస్యలు


మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నారాయణ్

మహారాణిపేట: రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ,జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కోరారు. శనివారం ఆయన నాయకత్వంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణ్, జి.శ్రీనివాస్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, మదన్‌లతో కలిసి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి జర్నలిస్టులకు త్వరలో హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని, వాటి ప్రీమియంలో 50 శాతం ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల పింఛన్ల విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తగు నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు లేదా ఇళ్ల కేటాయింపుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, త్వరలో దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చినట్టు శ్రీనుబాబు తెలిపారు. అనంతరం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు తదితరులు మంత్రిని కలిసి జర్నలిస్టుల సమస్యలను వివరించారు.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ దారిమళ్లింపు

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే, సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖలో జూలై 1, 4, 5, 8, 11, 12, 15, 18, 19, 22, 25, 26, 29, ఆగస్టు 1, 2, 5, 8, 9, 12, 15, 16, 19, 22, 23, 26, 29, 30వ తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం-అమృతసర్ (20807)హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో అమృతసర్‌లో జూలై 2, 5, 6, 9, 12, 13, 16, 19, 20, 23, 26, 27, 30, ఆగస్టు 2, 3, 6, 9, 10, 13, 16, 17, 20, 23, 24, 27, 30వ తేదీల్లో బయల్దేరే అమృతసర్-విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా సర్ల జంక్షన్, సంబల్‌పూర్ సిటీ రైల్వేస్టేషన్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహిస్తున్న బీఎస్సీ హానర్స్, ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో 40 మందికి ప్రవేశాలు కల్పిస్తామని, ఏడాదికి రూ.65 వేలు కోర్సు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను జూలై 11వ తేదీలోగా అందజేయాలన్నారు. జూలై 14న కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామన్నారు.